

వేతనాలు చెల్లించండి మహాప్రభో

నస్పూర్ మున్సిపాల్టీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎనిమిది నెలలుగా వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9లో▸

రంజాన్ వేళలు

గురు	శుక్ర
ఇఫ్తార్ 6:32	సహర్ 4:44

గరిష్టం/కనిష్టం

39.0 /28.0

వాతావరణం

ఆకాశం ఉదయం ప్రకాశవంతంగా, రాత్రి వేళ పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా వడగాలులు వీస్తాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు మరింతగా పెరుగుతాయి.

న్యూస్‌రీల్

లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ సమన్వయకర్తలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రంలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఓ సమన్వయకర్తను నియమించింది. ఈ మేరకు బుధవారం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో పది నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం, పార్టీ పరంగా కార్యక్రమాలు, కార్యకర్తలు, నాయకులతో సమన్వయం చేయనున్నారు. సిర్పూర్ నియోజకవర్గానికి జువ్వాజి అనిల్‌గౌడ్, చెన్నూర్‌కు జి.హైమావతి, బెల్లంపల్లికి మహ్మద్ ఖలీద్, మంచిర్యాలకు వేముల కృష్ణ, ఆసిఫాబాద్‌కు రాంశెట్టి నరేందర్‌నాయుడు, ఆదిలాబాద్ వైద్యుల అంజన్‌కుమార్, అర్జుమంద్ అలీ, బోథ్‌కు బి.సత్తు మల్లేష్, నిర్మల్‌కు కామ్రే అనిల్ కుమార్, ముథోల్‌కు ఇ.వెంకట్‌రామ్‌రెడ్డి, ఖానాపూర్‌కు మాల్సూరి సత్యనారాయణ, జునైద్ మీమన్‌లను నియమించారు.

తాగునీటి పర్యవేక్షణకు ప్రత్యేకాధికారులు



క్రిష్ణ ఆదిత్య



ప్రశాంత్ జీవన్ పాటిల్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వేసవిలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులను పర్యవేక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారులుగా సీనియర్ ఐఏఎస్‌లను నియమించింది. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు ఐ అండ్ సీఏడీ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్‌పాటిల్‌ను, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు కార్మిక శాఖ డైరెక్టర్ క్రిష్ణ ఆదిత్యను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక అధికారులు వచ్చే జూలై ముగిసే వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోజువారీగా ఇంటింటికీ తాగునీటి సరఫరా, ఇబ్బందులుపై దృష్టి సారించి, సమస్యలు పరిష్కరించాల్సి ఉంటుంది. ప్రత్యేక అధికారులుగా ఉన్నంత కాలం సెలవులు కూడా ఉండవని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇద్దరు అధికారులు గతంలో ఉమ్మడి జిల్లాలో పని చేశారు. ఇద్దరు ఐఏఎస్‌లు గతంలో ఐటీడీఏ పీవోలుగా, ఆసిఫాబాద్ జిల్లాకు కలెక్టర్‌గా ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు పని చేసిన అనుభవం ఉంది.

ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

మంచిర్యాలఅగ్రికల్చర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారులు రాహుల్, మోతిలాల్‌తో కలిసి ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోదాం నుంచి ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు నియోజకవర్గాలకు తరలింపు, స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చడం, 24 గంటల బందోబస్తు ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. జిల్లాలో 741 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆయా నియోజకవర్గాలకు 125 శాతం బ్యాలెట్ యూనిట్లు, 125శాతం కంట్రోల్ యూనిట్లు, 139 శాతం వీవీ ప్యాట్లు చొప్పున కేటాయించామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాములు, చెన్నూర్ రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో అశ్రద్ధ వహించొద్దు



మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

తాండూర్: హరితహారం మొక్కల పెంపకంపై ఎలాంటి అశ్రద్ధ వహించొద్దని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్‌డీవో) కిషన్ సూచించారు. బుధవారం మండలంలోని తాండూర్ గ్రామ పంచాయతీలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా తాండూర్ నర్సరీని పరిశీలించారు. వేసవిలో మొక్కలు చనిపోకుండా చర్యలు చేపట్టాలని, చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని అన్నారు. పారిశుధ్య పనులు, తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతకుముందు అడిషనల్ డీఆర్‌డీవో దత్తారావ్‌తో కలిసి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించి అభివృద్ధి పనులపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి తపాస్ పాల్గొన్నారు.

వాగులు గుల్ల !



చెన్నూరు బతుకమ్మవాగులో నుంచి ఇసుక తరలిస్తున్న వాహనాలను పట్టుకున్న పోలీసులు(ఫైల్)

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- గోదావరి తీరం, వాగులే అడ్డాగా దందా
- వాహనాలు పట్టుబడుతున్నా మారని తీరు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వేసవిలో వాగులు, వంకలు, గోదావరి తీరం నుంచి ఇసుక అక్రమంగా తరలిపోతూనే ఉంది. పటిష్ట నిఘా లేక రాత్రి, తెల్లవారుజామున ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. సమీప ప్రాంతాల్లో డంపులు ఏర్పాటు చేసుకుని అవసరమైన చోటుకు రవాణా చేస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం గోదావరినదిలో టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో ఇసుక అమ్మకాలు ఇంకా ప్రారంభం కాలేదు. గత ఏడాది అనుమతులు ఇచ్చినవి గడువు ముగిసిపోయాయి. గత ప్రభుత్వం ఉన్నప్పటి రీచ్‌లకు మళ్లీ కొత్త ప్రభుత్వం ఇవ్వలేదు. దీంతో కోటపల్లి మండలం కొల్లూరు, చెన్నూరు, ఎర్రాయిపేట, జైపూర్ మండలం వేలాల పరిధిలోని రీచ్‌లకు అనుమతులు రాలేదు. అలాగే పట్టాభూముల్లోనూ అనుమతి రాలేదు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో అనుమతులకు జాప్యం జరుగుతోంది.

అధికారికంగా లేకనే

స్థానిక భవన నిర్మాణ అవసరాలకు రెండే ఇసుక రీచ్‌లే ఉన్నాయి. గత జనవరిలో హాజీపూర్ మండలం వేంపల్లి రీచ్ ప్రారంభమైంది. ఈ రీచ్ నుంచి మంచిర్యాల, నస్పూర్, మందమర్రి, హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాలకు ఇసుక రవాణాకు అనుమతి ఉంది. బెల్లంపల్లి నియోజకవర్గ పరిధిలో నెన్నెల మండలం కర్జీ పరిధిలో మరో రీచ్ ఉంది. 'మన ఇసుక వాహనం' కింద ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసుకుంటే ఇసుక సరఫరా చేస్తారు. వీటిపై ఆధారపడకుండా జిల్లాలో ఉన్న వాగులు, ఒర్రెలు, గోదావరి తీరం వెంట అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. పలు చోట్ల పోలీసులు, గనుల శాఖ అధికారులు వాహనాలను పట్టుకున్నారు.

గోదావరి తీరం వెంట

గోదావరి తీర ప్రాంతాలైన జన్నారం మండలం నుంచి మొదలు, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్, మంచిర్యాల, నస్పూర్, జైపూర్, చెన్నూరు, కోటపల్లి వరకు నదీ తీరంలో ఇసుక రవాణా గుట్టుగా సాగుతోంది. కొందరు చాలాకాలంగా ఈ దందాలో ఆరితేరారు. వేసవిలో ఇసుక నిల్వ చేసి, వానాకాలంలో ఇసుక కొరత ఏర్పడితే ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. జైపూర్ మండలం రసూల్‌పల్లి వాగు నుంచి నిత్యం అక్రమంగా రవాణా జరుగుతూనే ఉంది. కన్నెపల్లి మండలం టేకులపల్లి వాగు, మందమర్రి మండలం రాళ్లవాగు, పాలవాగు, చెన్నూరు శివారు బతుకమ్మ వాగు నుంచి యథాతథంగా ఇసుకను తరలిస్తున్నారు. బెల్లంపల్లి, తాండూరు, కాసిపేట పరిధిలోనూ వాగుల నుంచి సన్న, దొడ్డు రకాల ఇసుక అక్రమంగా రవాణా జరుగుతోంది. ఇష్టారీతిన తవ్వకాలతో భూగర్భజలాలు ప్రమాదకరంగా మారనున్నాయి. అక్రమ ఇసుక రవాణాపై మైనింగ్ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

రాత్రి వేళ రవాణా

చీకటి పడ్డాకే వాగులు, గోదావరి తీర ప్రాంతాల నుంచి ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తున్నారు. ఉదయం 3నుంచి 5గంటల లోపు తెల్లవారుజామున రవాణా జరుగుతున్నాయి. డంపులు ఏర్పాటు చేసుకుని దూరాన్నిబట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో గోదావరి రోడ్డు, పాత మంచిర్యాల పరిధి నది నుంచి తీసుకెళ్తున్నారు. ఇసుక అక్రమ రవాణా చేయకుండా పోలీసులు బారికేడ్లు సైతం ఏర్పాటు చేశారు. ట్రాక్టర్ డ్రైవర్లుగా మైనర్లు ఉంటున్నారు. ఇసుక ట్రాక్టర్లతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. కొన్ని చోట్ల తరచూ పట్టుబడుతున్నా తీరుమారడం లేదు.

బీర్లు నో స్టాక్ !



గుడిపేటలోని లిక్కర్ డిపో

- మద్యం డిపోలో కొరత..
- బీరు బకాయిల చెల్లింపులో ప్రభుత్వ జాప్యం
- సరఫరా సగానికి పైగా నిలిపి వేసిన బీరు కంపెనీలు
- డిమాండ్‌కు తగిన విధంగా లేని సరఫరా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వేసవి కాలంలో చల్లని బీరు తాగాలని ఆశించే మద్యంప్రియులకు బీర్లు దొరకడం కష్టంగా మారుతోంది. ఇప్పటికే హాజీపూర్ మండలం గుడిపేటలోని మద్యం డిపోకు బీర్ల సరఫరా చాలావరకు నిలిచిపోయింది. వచ్చిన నిల్వలను డిపో పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లకు రేషియో పద్ధతిన సరఫరా చేస్తోంది. బీర్లకు కొరత ఏర్పడగా.. కొద్ది రోజుల్లో తీవ్రం కానున్నట్లు తెలుస్తోంది. గతంలో పలు కంపెనీలు ప్రభుత్వ లిక్కర్ గోదాములకు సరఫరా చేసిన బీరు నిల్వలకు బకాయిల చెల్లింపులో జాప్యమే కొరతకు కారణమని తెలుస్తోంది. గుడిపేట లిక్కర్ డిపో పరిధిలో 135 మద్యం దుకాణాలు, 28వరకు బార్లు ఉన్నాయి. వేసవిలో పెద్దయెత్తున బీర్ల అమ్మకాలు సాగుతాయి. గత ఏడాది మార్చిలో రెండు లక్షల వరకు బీరు కేసుల విక్రయాలు జరిగాయి. ఈ ఏడాది మార్చిలో 1.80లక్షల వరకు బీరు కేసులు మాత్రమే అమ్మకాలు జరిగాయి. గత ఏడాది బీరు కేసులు మద్యం దుకాణాల డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా జరిగి డిపోలో లక్షల కేసుల నిల్వలు ఉండేవి. ఇప్పుడు బీరు కేసులు వచ్చినవి వచ్చినట్లు విక్రయిస్తుండగా.. డిపోలో నిల్వలు ఉండడం లేదు. ఈ లెక్కన డిమాండ్‌కు తగిన విధంగా సరఫరా లేదని తెలుస్తోంది.

బిల్లులు పెండింగ్‌లో..

లిక్కర్ తయారీ కంపెనీల నుంచి ప్రభుత్వం వివిధ బ్రాండ్లకు సంబంధించి బీర్లు కొనుగోలు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోని మద్యం డిపోలకు సరఫరా చేస్తోంది. అక్కడి నుంచి రిటైల్ దుకాణాలకు సరఫరా జరుగుతుంది. లిక్కర్ తయారీ కంపెనీలు సరఫరా చేసిన మద్యం బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కొన్ని డిస్టిలరీస్, బ్రేవరేజేస్‌లు మద్యం ఉత్పత్తి తగ్గించడంతోపాటు బీరు నిల్వల సరఫరా చాలా వరకు తగ్గించేశాయి. వేసవిలో మార్చి నుంచి మే వరకు దాదాపు రూ.2కోట్ల విలువైన బీర్ల అమ్మకాలు జరుగుతాయి. ఒక్కో మద్యం దుకాణానికి రోజుకు సుమారుగా 50 బీరు కేసుల వరకు విక్రయాలు జరిగేవి. కానీ ఈ వేసవిలో 30 బీరు కేసుల వరకు కూడా సరఫరా చేయడం లేదని మద్యం వ్యాపారులు చెబుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో బీర్ల కొరత తీవ్రం కానుంది.

డిపో పరిసరాలు వెల వెల

గుడిపేట మద్యం డిపో పరిసరాలు నిత్యం కళకళలాడుతూ కనిపించేవి. ఇప్పుడు అందుకు భిన్నంగా వెల వెలబోతున్నాయి. పలు మద్యం కంపెనీలు బీరు నిల్వల సరఫరా తగ్గించడంతో లారీలు, ఇతర వాహనాల రాకపోకలు తగ్గాయి. మొన్నటి వరకు రోజుకు 20 వాహనాలకు పైగా మద్యం నిల్వలతో వచ్చిన సందర్భాలు ఉండగా ఇప్పుడు 10 వాహనాలు కూడా డిపోకు రావడం లేదు. డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను సంప్రదించగా.. డిపోకు వచ్చిన బీరు నిల్వలను అన్ని రిటైల్ మద్యం దుకాణాలకు రేషియో పద్ధతిన సమానంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు.

వడదెబ్బపై అవగాహన కల్పించాలి

- బాధితులకు ప్రత్యేక వార్డు
- జిల్లా కలెక్టర్ బి.సంతోష్
- పోస్టర్ల విడుదల



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్లు, అధికారులు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, జిల్లా అధికారులతో కలిసి అధిక ఉష్ణోగ్రత వల్ల మానవ శరీరంలో వచ్చే వ్యాధుల నియంత్రణ సంబంధిత వాల్‌పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వడదెబ్బకు గురైన వారికి వెంటనే ప్రథమ చికిత్స అందించి సమీపంలోని ఆస్పత్రికి తరలించాలని తెలిపారు. నీరు ఎక్కువగా తాగాలని, గొడుగులు, టోపీలు, కళ్లజోళ్లు ధరించాలని, నీటిశాతం అధికంగా ఉండే పండ్లు తీసుకోవాలని, మధ్యాహ్న సమయంలో నీడ ప్రదేశాల్లో ఉండాలని తెలిపారు. గర్భిణులు, వయోవృద్ధులు, చిన్నపిల్లలు ఎండలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మాతాశిశు కేంద్రంలో వడదెబ్బ బాధితులకు వైద్య సేవలు అందించేందుకు ఐదు పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతీ ఆశ కార్యకర్త వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో గణపతి, ప్రోగ్రాం అధికారి విజయపూర్ణిమ, వైద్యాధికారులు ఫయాజ్, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు హరిశ్చంద్రరెడ్డి, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతిలాల్, మిషన్ భగీరథ అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అధికారులు సమన్వయంతో గ్రామ స్థాయి ప్రణాళిక రూపొందించి దశలవారీగా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

యూనిఫాంలు సిద్ధం చేయాలి

వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంలోగా విద్యార్థులకు యూనిఫాంలు సిద్ధం చేయాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్, విద్యాధికారి యాదయ్యతో కలిసి సమావేశం నిర్వహించారు. జిల్లాలో 59 వేల మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున యూనిఫాంలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ నెల 5లోగా జిల్లాకు కేటాయించిన వరిధాన్యం కొనగోలు కేంద్రాలు ప్రారంభించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన పనులు చేపట్టి పూర్తి చేయాలని తెలిపారు.

'పది' మూల్యాంకనం షురూ

- ఉపాధ్యాయుల స్పందన కరువు
- గైర్హాజరు టీచర్లకు నోటీసులు



స్పాట్ విధుల్లో ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని కార్మెల్ హైస్కూల్‌లో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం బుధవారం ప్రారంభమైంది. ఉదయం 8గంటలకే ఉపాధ్యాయులు రిపోర్టు చేయాలని ఆదేశించినా స్పందన కరువైంది. అక్కడికి వచ్చిన వారు కూడా రిపోర్టు చేయడానికి ముందుకు రాకపోవడంతో నోటీసులు జారీ చేస్తామని పదే పదే మైక్‌లో చెప్పడం కనిపించింది. కొందరు టీచర్లు అనారోగ్యం, అత్యవసర కారణం చూపుతూ స్పాట్ వాల్యుయేషన్‌కు దూరంగా ఉండగా.. మరికొందరు చెప్పకుండానే గైర్హాజరైనట్లు తెలుస్తోంది. ఏఈ, స్పెషల్ అసిస్టెంట్‌గా నియమితులైన చాలామంది ఉపాధ్యాయులు రిపోర్టు చేయలేదు. మధ్యాహ్నం 2గంటల్లోపు రిపోర్టు చేయని ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి సెల్‌ఫోన్ సందేశం పంపించారు.

ఇలా..

ఇతర జిల్లాల నుంచి ఆయా పరీక్షలకు సంబంధించిన 1,25,746 జవాబు పత్రాలు మూల్యాంకన కేంద్రానికి చేరాయి. స్పాట్ వాల్యుయేషన్‌కు డీఈవో యాదయ్య శిబిరం అధికారిగా, పరీక్షల విభాగం సహాక కమిషనర్ దామోదర్‌రావు సహాయ క్యాంపు అధికారిగా వ్యవహరిస్తారు. పేపర్ కోడింగ్ అధికారులుగా ఏడుగురు, చీఫ్ కోడింగ్ అధికారితోపాటు సహాయకులు ఆరుగురు ఉంటారు. అసిస్టెంట్ ఎగ్జామినర్(ఏఈ)లు 384, చీఫ్ ఎగ్జామినర్(ముఖ్య మూల్యాంకన అధికారులు)లు 66మంది, ప్రత్యేక సహాయకులు 128మంది ఉపాధ్యాయులకు రెండ్రోజుల ముందు విధులు కేటాయించారు. సోషల్, తెలుగు, హిందీ, ఇంగ్లిషు టీచర్ల కొరత ఎక్కువగా కనిపించింది. కొందరు టీచర్లు కారణాలు వెతికి విధుల నుంచి తప్పించుకోవాలని చూడడంతో తొలి రోజు మూల్యాంకనం మందకొడిగా సాగింది. విధులకు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేయనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

ఎందుకిలా..

స్పాట్ వాల్యుయేషన్ విధులకు టీచర్లు ఆసక్తి చూపకపోవడం చర్చనీయాంశమైంది. ఒంటి పూట బడుల నిర్వహణ.. వరుస సెలవులు కూడా కారణంగా తెలుస్తోంది. మూల్యాంకన కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలి. ఒంటి పూట బడులకు వెళ్తే మధ్యాహ్నం నుంచి ఇంటిపట్టున ఉండొచ్చు. మంచిర్యాల నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో విధులు నిర్వర్తించే టీచర్లు స్పాట్ విధులకు ఇష్టపడగా.. మంచిర్యాల సమీప ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే వారు అనాసక్తి చూపినట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యేల ఐక్యత రాగం !

- కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం ఏకం
- 'కొక్కిరాల' నివాసంలో సమావేశం



హైదరాబాద్‌లోని ప్రేంసాగర్‌రావు నివాసంలో సమావేశమైన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీక్రిష్ణను గెలిపించుకునేందుకు స్థానిక ఎమ్మెల్యేలంతా ఏకమవుతున్నారు. తమ పార్టీ అభ్యర్థి విజయం సాధించేందుకు అందరం కలిసికట్టుగా పని చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు బుధవారం పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, అభ్యర్థి వంశీక్రిష్ణ హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వివేక్, అడ్లూరి లక్ష్మణ్, విజయరమణారావు, మక్కాన్‌సింగ్ ఠాకూర్ కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి ఐక్యత చాటారు.

వ్యతిరేక ప్రచారాలకు తెర

ఎంపీ అభ్యర్థిగా గడ్డం వంశీ పేరు ప్రకటించినప్పటి నుంచి అనేక రకాలుగా ప్రచారాలు సాగుతున్నాయి. వంశీ అభ్యర్థిత్వంపై కొందరు ఎమ్మెల్యేలకు ఇష్టం లేదని, ఆయనను వ్యతిరేకిస్తున్నారంటూ ప్రచారం జరిగింది. ఈ క్రమంలో తామంతా ఒక్కటే, అందరం ఏకమై గెలిపించుకుంటామని అందరికీ తెలియజేశారు. దీంతో పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని పార్టీ కార్యకర్తలు, నాయకులకు తామంతా కలసి పని చేస్తామనే ఓ సంకేతాన్ని ఇచ్చారు. మరోవైపు మాదిగలకు టికెట్ ఇవ్వకుండా మాలలకే అవకాశం ఇవ్వడం, 'గడ్డం' ఫ్యామిలీ నుంచే ముగ్గురికి ప్రాధాన్యత ఇవ్వడంపైనా విమర్శలు వస్తున్నాయి. దీనిపై మంత్రి శ్రీధర్ బాబు ఓ వివరణ ఇచ్చారు. పార్టీ అధిష్టానం సర్వేలు చేయించి, అనేక పరిశీలనల తర్వాతే టికెట్ ఖరారు చేసిందన్నారు. అంతేకాక కార్యకర్తలు, నాయకులు వంశీ గెలుపు కోసం పని చేయాలని కోరారు.

అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్యే కే.ప్రేమ్‌సాగర్‌రావు మంచిర్యాల, అంతర్గాం మధ్య గోదావరి నదిపై నిర్మించే బ్రిడ్జిపై అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మంచిర్యాల, అంతర్గాం బ్రిడ్జి 12 మీటర్ల వెడల్పు ఉంటుందని, ప్రస్తుతం మంచిర్యాల రైల్వే ఓవర్ బ్రిడ్జి, పాతమంచిర్యాల రాళ్లవాగు బ్రిడ్జిల వెడల్పు 7 మీటర్లే ఉంటుందని గుర్తు చేశారు. కానీ మంచిర్యాల, అంతర్గాం బ్రిడ్జిని సింగిల్ లేన్ ద్వారానే నిర్మిస్తున్నారని ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తనపై కోపంతోనే ముల్కల్ల వద్ద నిర్మించాలని నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. రూ.164 కోట్లతో నిర్మించే బ్రిడ్జిని ముల్కల్ల వద్ద రూ.450 కోట్లతో నిర్మించాలనుకోవడం ఏంటని, మంచిర్యాల వద్ద బ్రిడ్జి నిర్మిస్తే మంచిర్యాల, పెద్దపల్లికి మధ్య దూరం 18 కిలోమీటర్లు తగ్గుతుండగా, ముల్కల్ల వద్ద బ్రిడ్జి నిర్మాణంతో 5 కిలోమీటర్ల దూరం మాత్రమే తగ్గుతుందని ఆరోపించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, నాయకులు శ్రీపతి శ్రీనివాస్, తాజ్, చంద్రశేఖర్ హండే, సుంకరి రమేశ్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు

మంచిర్యాలఅర్బన్: ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశానికి ఈ నెల 7న నిర్వహించే పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. 7నుంచి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు, 7నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. దండేపల్లి మండలం లింగాపూర్, కాసిపేట, మందమర్రి కార్మెల్ హైస్కూల్, ఎస్ సీహెచ్ఎస్, మంచిర్యాల రాజీవ్‌నగర్ మోడల్ స్కూల్, బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కోటపల్లి మండలంలోని మోడల్ స్కూల్‌లో తరగతుల వారీగా పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నీడలా నిఘా



తనిఖీ బృందం వాహన సీసీ కెమెరాతో చిత్రీకరణ

దండేపల్లి: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎన్నికల ప్రచారంపై అధికార యంత్రాంగం నిఘా నీడలా అనుసరిస్తోంది. ప్రచారంలో అనుమతులు అతిక్రమిస్తున్నారా? ఎంత ఖర్చు చేస్తున్నారు.. ప్రచారం తీరుపై ఎప్పటికప్పుడు తనిఖీ బృందాలు వీడియో చిత్రీకరణ చేస్తున్నాయి. దండేపల్లిలో బుధవారం పెద్దపల్లి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ ప్రచార తీరును ఎన్నికల తనిఖీ బృందం తమ వాహన సీసీ కెమెరాతోపాటు సిబ్బంది వీడియో ద్వారా చిత్రీకరించారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాతమంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ మాదిగలకు పార్లమెంటు సీట్లు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య మాట్లాడుతూ మాదిగలకు టికెట్లు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తోందని విమర్శించారు. తెలంగాణలోని 17పార్లమెంటు స్థానాల్లో ఒక్కటీ మాదిగ సామాజిక వర్గానికి కేటాయించలేదని అన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు కాంగ్రెస్ పార్టీ రెండు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్న పార్టీ వైపు నిలబడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పట్టణ ఇంచార్జి చిప్పకుర్తి మల్లేష్, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇంచార్జి సతీష్, మండల అధ్యక్షుడు కుష్నపల్లి రాజలింగు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హత్య కేసులో ఒకరికి జీవితఖైదు

ఆసిఫాబాద్అర్బన్: భార్యను హతమార్చిన కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ తీర్పునిచ్చారు. కోర్టు కాగజ్నగర్ సబ్ డివిజన్ లైజనింగ్ అధికారి బాబాజీ తెలిపిన వివరాల ప్రకారం.. 2023లో పెంచికల్పేట్ మండలం మురళిగూడ గ్రామానికి చెందిన కమెరా శ్రీనివాస్ (43)పై అతడి భార్య లక్ష్మి (43)ని హత్య చేసిన నేరంపై కేసు నమోదైంది. పీపీ జగన్మోహన్రావ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా, ఎం.విజయ్, కే నాగరాజు, సీఐలు విచారణ జరపగా హత్యానేరం రుజువైంది. దీంతో నేరస్తుడు కమెరా శ్రీనివాస్కు సెక్షన్ 302 ఐపీసీ ప్రకారం కోర్టు జీవితకాలం జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధించింది. శ్రీనివాస్కు చెందిన ఆస్తిని పిల్లల పేరిట జమ చేయాల్సిందిగా సంబంధిత తహసీల్దార్కు ఉత్తర్వులు ఇచ్చింది. వ్యక్తి కాంపెన్సేషన్ స్కీం కింద జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పిల్లలకు తగిన న్యాయం జరిగేలా జడ్జి తీర్పునిచ్చారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత కాగజ్నగర్ రూరల్ సీఐ రాంబాబు, ప్రస్తుత పెంచికల్పేట ఎస్సై కొమురయ్య, కోర్టు సిబ్బందిని ఎస్పీ సురేశ్కుమార్ అభినందించారు.

రూ.15.69 లక్షలు పట్టివేత

వాంకిడి: మండలంలోని టోల్ప్లాజా వద్ద బుధవారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో వేర్వేరు వ్యక్తుల నుంచి సరైన ఆధారాలు లేని రూ.15,69,120 నగదు పట్టుబడినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన 11 మంది మంచిర్యాలకు వెళ్తుండగా వారి వద్ద ఈ నగదు పట్టుబడినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన నగదును సీజ్ చేసినట్లు తెలిపారు. సీఐ శ్రీనివాస్, ఏఎస్సై పోశెట్టి, సిబ్బంది పాల్గొన్నారు.

బజ్జీలు వేసి.. ఓటర్లను ఆకట్టుకుని..



హోటల్లో బజ్జీలు వేస్తున్న బీజేపీ అభ్యర్థి

దండేపల్లి: మండల కేంద్రంతో పాటు తాళ్లపేట, ముత్యంపేటలో బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్తో కలిసి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కిరాణా దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, తాళ్లపేట వారసంతలో ఓట్లు అభ్యర్థించారు. బీజేపీని ఆదరించి మోదీని మళ్లీ ప్రధానిని చేయాలని కోరారు. ప్రచారంలో భాగంగా దండేపల్లిలోని ఓ హోటల్లో బజ్జీలు వేస్తూ ఓటర్లను ఆకట్టుకున్నారు. పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

‘మట్టి’ కరిచిన బొగ్గు ఉత్పత్తి

- లక్ష్యాన్ని సాధించని ఓబీ సంస్థలు
- మట్టి తీయక ఉత్పత్తిలో వెనుకంజ
- లక్ష్యం చేరుకోని శ్రీరాంపూర్ డివిజన్
- భూగర్భ గనుల్లోనే సత్ఫలితాలు



శ్రీరాంపూర్ డివిజన్ ముఖద్వారం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్ ఈసారి వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడంలో వెనుకబడింది. దీనికి కారణం ఓబీ (ఓవర్ బర్డెన్) మట్టి అనుకున్నంత తీయకపోవడమే. దీని ప్రభావం ఉత్పత్తిపై పడింది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి శ్రీరాంపూర్ డివిజన్ గనులకు 66.4 లక్షల టన్నుల లక్ష్యం ఉంది. మార్చి 31 నాటికి ఈ మొత్తాన్ని సాధించాలి. కానీ.. 59.06 లక్షల టన్నులు మాత్రమే సాధించింది. ఇంకా ఏడు లక్షల టన్నుల లోటు ఏర్పడింది. దీంతో 89 శాతమే ఉత్పత్తి లక్ష్యం నమోదైంది. 100 శాతం ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని మొదటి నుంచి ఏరియా అధికారులు, గనుల అధికారులు ఎంతో శ్రమించినా ఫలితం లేకుండాపోయింది. దీనికి కారణం ఓబీ సంస్థలు అనుకున్నంత లక్ష్యం మేరకు ఓబీని తీయకపోవడమే. శ్రీరాంపూర్ ఏరియాలో మొత్తం ఏడు భూగర్భ గనులు, రెండు ఓసీపీ లున్నాయి. భూగర్భగనుల్లో 92 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైంది. ఓసీపీల్లో 88 శాతం బొగ్గు ఉత్పత్తి నమోదైంది. కంపెనీలోని మిగతా ఏరియాల్లోని భూగర్భ గనులతో పోల్చితే శ్రీరాంపూర్లో భూగర్భ గనుల్లో వచ్చిన ఉత్పత్తి ఎక్కువే అని చెప్పవచ్చు. సాధారణంగా భూగర్భ గనుల్లో నూరు శాతం ఉత్పత్తి నమోదు కావడం అరుదు. ఓసీపీల్లో వచ్చే అధిక ఉత్పత్తితో భూగర్భ గనుల్లో వచ్చే ఉత్పత్తి లోటును భర్తీ చేస్తారు. కానీ.. శ్రీరాంపూర్ ఏరియాలో ఇందుకు భిన్నంగా ఉంది.

150లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ లోటు

శ్రీరాంపూర్లోని రెండు ఓసీపీల్లో నిర్దేశించిన ఓబీ లక్ష్యంలో 150 లక్షల టన్నులు తక్కువగా తీశారు. ఈ లోటు కారణంగానే బొగ్గు ఉత్పత్తి తగ్గింది. ఓబీ తీస్తేనే దాని కింద ఉన్న బొగ్గు తీయడం వీలవుతుంది. శ్రీరాంపూర్ ఓసీపీలో సీఆర్ఆర్, జీవీఆర్, కేఆర్ఆర్ అనే ఓబీ సంస్థలు మట్టి వెలికితీత పనులు చేస్తున్నాయి. ఇందులో జీవీఆర్ వారికి నిర్దేశించిన ఓబీ లక్ష్యంలో 100శాతం, కేఆర్ఆర్ 70శాతం, సీఆర్ఆర్ 70 శాతం తీశాయి. మిగతా ఇందారం ఓసీపీలో వరహా సంస్థ ఐతే 33 శాతమే ఓబీ తీసింది. ఓబీ సంస్థలకు నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించకపోవడంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారు అనుకున్నంత ఓబీ తీస్తే నేడు శ్రీరాంపూర్ డివిజన్ నూరు శాతం లక్ష్యాన్ని నమోదు చేసుకునేదని అధికారులు వాపోతున్నారు. మొదటి నుంచి ఏరియా జీఎం, కంపెనీ డైరెక్టర్లు ఓబీ సంస్థల ప్రతినిధులను హెచ్చరిస్తూ వస్తున్నా వారు అనుకున్నంత పుంజుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తంజేస్తున్నారు. అనుభవం లేని, పూర్తి యంత్ర, మ్యాన్పవర్ సామర్థ్యం లేని సంస్థలు ఓబీ పనులు దక్కించుకోవడంతోనే నేడు కంపెనీలో చాలా ఓబీల్లో ఈ తరహా ఉత్పత్తి సమస్యలు వస్తున్నాయని కార్మిక సంఘాల నేతలు పేర్కొంటున్నారు. ఓబీ సంస్థల నిర్వాకంతో గడువులోపు రూ.కోట్ల విలువైన బొగ్గు వెలికి తీయక సంస్థకు నష్టం వాటిల్లుతుందని చెబుతున్నారు.

ఓబీ ప్రభావంతోనే..

ఓబీ ప్రభావంతో శ్రీరాంపూర్ డివిజన్లో నూరుశాతం బొగ్గు ఉత్పత్తి నమోదు కాలేదు. ఓబీ సంస్థలు అనుకున్న లక్ష్యాన్ని సాధించకపోవడంతో దాని ప్రభావం బొగ్గు ఉత్పత్తిపై పడింది. దీనిపై సమీక్షిస్తాం.
– బీ సంజీవరెడ్డి, శ్రీరాంపూర్ జీఎం

ఇంటివద్దకే భద్రాద్రి తలంబ్రాలు

- ఆర్టీసీ లాజిస్టిక్స్ సర్వీస్ ద్వారా పంపిణీ



ఆర్టీసీ ప్రచార కరపత్రం

మంచిర్యాలఅర్బన్: ఆర్టీసీ లాజిస్టిక్ ద్వారా భద్రాచలం నుంచి రాములోరి తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కల్యాణానికి వెళ్లలేని భక్తులు తలంబ్రాలను అందుకునేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా లాజిస్టిక్స్ కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆర్టీసీ యాజమాన్యం తలంబ్రాల పంపిణీపై విస్తృత ప్రచారం చేపట్టింది. ఇందులో భాగంగా రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేయించుకుని రశీదు పొందితే ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు అందించనుంది. ఈదఫా ఆన్లైన్, మాన్యువల్గా బుక్ చేసుకునే సౌకర్యం ఆర్టీసీ యాజమాన్యం కల్పించింది. సీతారామ కల్యాణోత్సవం అనంతరం తలంబ్రాలను భక్తులకు ఇంటివద్దకే చేరవేస్తారు. రెండు సంవత్సరాలుగా మంచి స్పందన రావటంతో ఈసారి కూడా భద్రాచలం వెళ్లలేని భక్తుల సౌకర్యం కోసం ఈ సౌకర్యం కల్పించినట్లు మంచిర్యాల డీఎం రవీంద్రనాథ్ తెలిపారు. ఈనెల 4నుంచి 18వ తేదీ వరకు తలంబ్రాలు బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ను 9154298541 నంబర్లో లేదా డిపో కార్గో ఇన్చార్జిని 7382841860 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

మామిడితోట వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామంలో ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలోని 25 ఎకరాల మామిడి తోట పంట (కాత)కు వేలం నిర్వహించారు. బుధవారం తోటలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉద్యానవన శాఖ జిల్లా అధికారి వీ ఉదయ్కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, (బెల్లంపల్లి మండల ప్రత్యేకాధికారి) సీహెచ్ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎం.కనకయ్య రూ.1,02,500కు మామిడి తోట (కాత) దక్కించుకున్నాడు. ఈ ఏడాది ఒకే పంటకు వేలం వర్తిస్తుందని పేర్కొన్నారు. వాతావరణ మార్పులతో తక్కువగా పూత వచ్చి మామిడి పంట ఆశాజనకంగా లేనందున వేలం ద్వారా ఆదాయం తక్కువగా వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి గంగారామ్, ఉద్యానవన శాఖ బెల్లంపల్లి అధికారి సీహెచ్ సుప్రజ, స్థానికులు పాల్గొన్నారు.

7న ఉద్యోగుల సంఘం మహాసభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సమస్యలపై చర్చించడానికి ఈ నెల 7వ తేదీన గోదావరిఖని ప్రెస్క్లబ్లో రామగుండం రీజియన్ మహాసభ నిర్వహించనున్నట్లు తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య తెలిపారు. బుధవారం ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ క్లబ్లో విలేకరులతో మాట్లాడారు. ‘సింగరేణి పరిరక్షణ–కార్మికుల హక్కులు’ అనే అంశంపై నిర్వహించే సభకు ముఖ్య అతిథిగా టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, విద్యావంతుల వేదిక నాయకులు అంబటి నాగయ్య, గురజాల రవీందర్రావు హాజరవుతారని పేర్కొన్నారు. సింగరేణిలో కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని, సంస్థ ప్రమాదంలో పడిందని తెలిపారు. మూడు లక్షల మంది ఉత్పత్తి చేయాల్సిన 70 మిలియన్ టన్నుల బొగ్గును 40 వేల మంది పర్మనెంట్ ఉద్యోగులు, 30 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులతో ఉత్పత్తి చేశారని తెలిపారు. ఇది పనిభారానికి నిదర్శనమని పేర్కొన్నారు. సింగరేణిలో కొత్త భూగర్భగనులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఓపెన్ కాస్ట్లపై ప్రభుత్వ వైఖరి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, ఉపాధ్యక్షుడు దేవి సత్యనారాయణ, కార్యదర్శి వెంగల కనకయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు జైపాల్సింగ్, గొల్ల అంజన్న, శ్రీధర్, నాయకుడు సుధాకర్ ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచాలి



మాట్లాడుతున్న అఫ్రోజ్ఖాన్

శ్రీరాంపూర్: పెరిగిన ధరలకు అనుగుణంగా కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలను పెంచాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ఖాన్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ సీహెచ్పీలో బుధవారం ఆయన కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన గేట్ మీటింగ్లో మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రతీ ఐదు సంవత్సరాలకోసారి వేతనాలు సవరించాల్సి ఉందని, కానీ.. 2012 నుంచి ఇప్పటివరకు వేతనాలు పెరగలేదన్నారు. జీతాల పెరుగుదలకు సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ చేసిన అనేక పోరాటాల ఫలితంగా 2021 జూన్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీవో నంబర్ 22ను తీసుకువచ్చిందని, దానిని గెజిట్ చేయకుండా కార్మికులకు ద్రోహం చేసిందని ఆరోపించారు. ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నంబర్ 22కు బదులు 94 తీసుకువచ్చిందని, వెంటనే దీనిని రద్దుచేసి జీవో 22 ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. వేసవి దృష్ట్యా సర్ఫేస్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులందరికీ ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షుడు డీ రవీందర్, కార్యదర్శి బూర వీరేశం, బ్రాంచ్ ఉపాధ్యక్షులు రాచర్ల చంద్రమోహన్, చాతరాజు ప్రభాకర్, సహాయ కార్యదర్శి చారి, కోశాధికారి పల్లె సత్యనారాయణ, కోమల తదితరులున్నారు.

ఐదుగురు బెట్టింగ్ రాయుళ్ల పట్టివేత

- రూ.30వేలు.. సెల్ఫోన్లు స్వాధీనం



నిందితులతో టాస్క్ఫోర్స్ పోలీసులు

కాగజ్నగర్ రూరల్: కాగజ్నగర్ రూరల్ సర్కిల్ పరిధిలోని పెంచికల్పేట, కాగజ్నగర్ మండలంలోని జీడిచేను గ్రామాల్లో నిషేధిత అప్లికేషన్స్ ద్వారా ఆన్లైన్ ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న వారిని బుధవారం టాస్క్ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. టాస్క్ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. పెంచికల్పేట గ్రామానికి చెందిన పోలోజు నరేశ్ అనే వ్యక్తిని పట్టుకుని విచారించగా, ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ను వాట్సప్, టెలిగ్రాం, వివిధ సోషల్ నెట్వర్కింగ్ సైట్లలో పోస్టు చేస్తున్నాడని పేర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న పెంచికల్పేటకు చెందిన భుజాడి తిరుపతి, కాగజ్నగర్ మండలం జీడిచేను గ్రామానికి చెందిన మేడిగొండ లక్ష్మణ్, బొడ్డు రాజశేఖర్, బూస సుభాష్ను పట్టుకున్నామన్నారు. వీరి నుంచి రూ.30వేల నగదు, ఐదు సెల్ఫోన్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. టాస్క్ఫోర్స్ సిబ్బంది మధు, రమేశ్, సంజీవ్ పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్, లైంగికదాడి కేసులో నిందితుడి అరెస్ట్

- పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సిలాల్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని జిల్లా అటవీశాఖ కార్యాలయ సమీపంలో ఉంటున్న ఓ బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడ్డ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు సీఐ బన్సిలాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బాధిత బాలికను స్థానిక రాంనగర్కు చెందిన గుర్రాల శ్రీకాంత్ ప్రేమించి పెళ్లి చేసుకుంటానని ఆర్నెళ్లుగా వెంటపడుతున్నాడు. విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు చెప్పడంతో శ్రీకాంత్ను మందలించారు. కొంతకాలం తర్వాత మళ్లీ వెంటపడుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 28న పదో తరగతి పరీక్షలు రాసేందుకు వెళ్లిన బాలికను వెంబడించాడు. పరీక్షా కేంద్రానికి వచ్చిన బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేశాడు. విషయం తెలిసిన బాలిక కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చేపట్టారు. సదరు బాలికను వేములవాడకు తీసుకువెళ్లిన శ్రీకాంత్ వివాహం చేసుకున్నాడు. అక్కడ గది అద్దెకు తీసుకుని నాలుగు రోజులు గడిపాడు. ఈ నెల 2వ తేదీన తిరుపతికి వెళ్దామని బాలికతో కలిసి హన్మకొండ బస్టాండ్కు చేరుకున్నాడు. ఈక్రమంలో వాటర్ బాటిల్ కోసం శ్రీకాంత్ బయటకు వెళ్లగా బాలిక తప్పించుకుని ఇంటికి చేరింది. కుటుంబ సభ్యులకు జరిగిన విషయం తెలుపగా వారు పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం శ్రీకాంత్ను పోలీసులు మంచిర్యాలలో అరెస్ట్ చేశారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పైపులైన్ లీకేజీకి మరమ్మతులు



పైపులను సరిచేసేందుకు తవ్విన రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్రూరల్: మండలంలోని లంబడిపల్లిలో మిషన్ భగీరథ నీటిని వాటర్ ట్యాంకులో నింపుతున్నా పైపులైన్ల లీకేజీలుండడంతో నల్లాలకు నీరు రావడం లేదు. దీంతో ‘నీరున్నా లీకేజీలు’ శీర్షికన గత నెల 30న ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. బుధవారం రోడ్డు తవ్వించి పైపులైన్ లీకేజీలు సరి చేయిస్తున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ‘సాక్షి’కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

మైనింగ్స్టాఫ్పై వేధింపులు మానుకోవాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో ఏ ప్రమాదం జరిగినా ఇందుకు మైనింగ్ స్టాఫ్ను బాధ్యులుగా చేస్తూ యాజమాన్యం వేధింపులకు గురి చేస్తోందని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్రావు ఓ ప్రకటనలో ఆరోపించారు. ఇటీవల ఎస్సార్పీ–1 గనిలో హామర్మన్ కార్మికుడు గాయాలపాలైన ఘటనలో పూర్తి విచారణ చేపట్టకుండానే ఓవర్మన్ను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రమాద పూర్వపరాలు, అక్కడున్న పరిస్థితులపై లోతుగా విచారణ చేపట్టకుండా ఓవర్మన్ను బలి చేయడం సరికాదని పేర్కొన్నారు. ఏదేని ప్రమాదం జరిగితే ప్రాథమిక, మౌఖిక, మైనింగ్ ఇన్స్పెక్టర్ విచారణ తర్వాతే యాజమాన్యం నిజనిర్ధారణ జరిపి ఎవరు బాధ్యులో తేల్చాల్సి ఉందని తెలిపారు. ఇవేమీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. యాజమాన్యం పునరాలోచించి సస్పెన్షన్ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

పాడె మోసిన పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్



పాడె మోస్తున్న గోమాస శ్రీనివాస్

భీమారం: జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు, తాజా మాజీ సర్పంచ్ దర్శనాల రమేశ్ తండ్రి రాజయ్య మృతి చెందగా బుధవారం పోలంపల్లిలో నిర్వహించిన అంత్యక్రియల్లో బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ పాల్గొని పాడె మోశారు. అంతకుముందు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నేతకాని సంఘం నాయకుడు నాగరాజు ఉన్నారు.

కోడ్ ఉల్లంఘించారని వంశీపై ఫిర్యాదు

రామకృష్ణాపూర్: పెద్దపల్లి లోక్సభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ఎన్నికల నియామవళిని ఉల్లంఘించారని పట్టణానికి చెందిన కదం శ్రావణ్కుమార్ లోక్సభ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మంచిర్యాల ఆర్డీవోకు బుధవారం ఫిర్యాదు చేశారు. ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ పుట్టిన రోజు ఈ నెల 1న గడ్డం వంశీ ధర్మపురిలోని క్యాంప్ కార్యాలయంలో ఓ ఎలక్ట్రిక్ బైక్ను లక్ష్మణ్కు బహుమతిగా ఇచ్చారని పేర్కొన్నారు. ఆ సందర్భంగా ఓటర్లను ప్రభావితం చేసేలా మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని, ఈ విషయమై విచారణ జరిపించి వంశీ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ

నెన్నెల: మండలంలోని జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏస్కూరి కృష్ణవేణి ఇంట్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణవేణి ఇంట్లో వారంతా ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. బుధవారం ఇంటికి చేరుకోగా ఇంటి తాళం పగిలి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి కనిపించింది. అందులోని మూడు తులాల బంగారు నగలు, 10 తులాల వెండి గొలుసులు, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. నెన్నెల పోలీసులకు ఫిర్యాదు చేయగా, బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలొద్దీన్, నెన్నెల ఎస్సై ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్తో ఫింగర్ ప్రింట్లు, ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

గుర్తు తెలియని ట్రైన్ ఢీకొని ఒకరు మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మందమర్రిరూరల్: మందమర్రి రైల్వేస్టేషన్ ప్లాట్ఫాం ఆవరణలో గుర్తు తెలియని ట్రైన్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే హెడ్కానిస్టేబుల్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి సుమారు 9గంటల ప్రాంతంలో మందమర్రి రైల్వేస్టేషన్ ప్లాట్ ఆఫ్ లైన్ ట్రాక్పై ఒకరు ప్రమాదానికి గురై మూలుగుతుండగా సిబ్బంది గుర్తించారు. 108 ద్వారా మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయాలు తీవ్రంగా తగలడంతో బుధవారం తెల్లవారుజామున మృతి అతడు చెందాడు. మృతుడి వయస్సు 30–35 ఉంటుంది. మృతదేహంపై బ్లూ, వైట్ షర్ట్ ఉంది. ఇంకా ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహం మంచిర్యాల ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంది. సంబంధీకులు 8328512176 నంబర్లో సంప్రదించాలని సంపత్ సూచించారు.

అప్పల బాధతో వలస కూలీ ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని పెట్రోల్ పంపు సమీపంలో నివసిస్తున్న ఉత్తరప్రదేశ్కు చెందిన ఇర్ఫాన్ఖాన్ (25) అనే వలస కూలీ ఉరేసుకుని మృతి చెందినట్లు స్థానిక ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఇర్ఫాన్ఖాన్ మూడు నెలల క్రితం ఉత్తరప్రదేశ్ నుంచి పట్టణానికి కూలీ పనుల కోసం స్నేహితులతో వచ్చాడు. పనులు సరిగా దొరకక మద్యానికి బానిసై అప్పులపాలయ్యాడు. తిరిగి ఇంటికి వెళ్తే కుటుంబీకులు ఇబ్బందులు పడుతారని ఆవేదనకు గురయ్యాడు. బుధవారం ఉదయం ఇంటి ఆవరణలో ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి బావమరిది వశీఖాన్ ఫిర్యాదు మేరకు అదనపు ఎస్సై రామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి



శాంతాబాయి (ఫైల్)

వాంకిడి: వేగంగా వచ్చిన ఓ ఐచర్ వాహనం ముందు వెళ్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టిన ఘటనలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం వాంకిడి మండలంలోని నాలుగు వరుసల జాతీయ రహదారి–363పై చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇందాని గ్రామానికి చెందిన జాడి శాంతాబాయి (65) బుధవారం వాంకిడిలో జరిగే పెళ్లికి బయలుదేరింది. ఇందాని ఎక్స్ రోడ్డు వద్ద బస్సు కోసం వేచి చూస్తుండగా అదే సమయంలో ఖిరిడి గ్రామానికి చెందిన చౌదరి బుద్దాజి తన ద్విచక్ర వాహనంపై వాంకిడికి వెళ్తున్నాడు. బుద్దాజి పరిచయం ఉన్న వ్యక్తి కావడంతో శాంతాబాయి అతడి వాహనంపై ఎక్కింది. ఈ క్రమంలోనే జాతీయ రహదారి–363పై ఉన్న టోల్ ప్లాజా సమీపంలో ఆసిఫాబాద్ వైపు నుంచి వాంకిడి వైపునకు వస్తున్న ఓ ఐచర్ వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. బుద్దాజి వాహనంతో పాటు మరో ద్విచక్ర వాహనం సమీపంలోనే ఉండటంతో దానిని కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శాంతాబాయి, బుద్దాజీతో పాటు మరో ద్విచక్ర వాహనంపై ఉన్న ఆసిఫాబాద్ మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన కవల్కార్ బిజ్జు, రాగిట్కార్ సంగీత, ఆమె కూతురు నందినికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించగా శాంతాబాయికి వీపు భాగం, పక్కటెముకల్లో తీవ్ర గాయాలు కావడంతో రెండు గంటలు చికిత్స పొంది మృతి చెందింది. బుద్దాజీ రెండు కాళ్లు విరిగిపోగా మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఐచర్ వాహనం డ్రైవర్ మహారాష్ట్రలోని బల్లార్షకు చెందిన దవాలె ప్రమోద్గా గుర్తించారు. మృతురాలి కుమారుడు జాడి రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రక్షణ, ఆరోగ్యంపై అవగాహన

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి ఉద్యోగుల రక్షణ, ఆరోగ్యంపై బుధవారం ఏరియాలోని ఇల్లందు క్లబ్ ఆవరణలో బెల్లంపల్లి రీజియన్ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఏరియా జీఎం మనోహర్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు సేఫ్టీ జీఎం (కార్పొరేట్) గురువయ్య హాజరై ఏరియాలోని గనుల్లో రక్షణ, ఉద్యోగుల ఆరోగ్యంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంబంధిత అధికారులు అన్ని గనులు, డిపార్ట్మెంట్లకు వెళ్లి ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకోవాలని సూచించారు. హెల్త్ చెక్లిస్ట్ ప్రకారం ఆడిట్ చేసి అవగాహన కల్పించాలని తెలిపారు. సదస్సులో బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్, శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి, ఏజీఎం (సేఫ్టీ) బెల్లంపల్లి రీజియన్ రఘుకుమార్ పాల్గొన్నారు.